సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 11 । జనవరి । 2025



వద్దన్నా.. ఆగని 'అదానీ'

విద్యుత్తు భారంతో ఇప్పటికే సతమతమవుతున్న ఇంటి యజమానులకు మరో షాక్ తగులుతోంది. త్వరలో స్మార్టు మీటర్లు బిగించనున్నారు. -IIలో



టీడీపీలో ఇరు వర్గాల ఘర్షణ

ప్రభుత్వ స్థలంలో బంకులు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకునే విషయమై టీడీపీలోని ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిన సంఘటన గుర్రంకొండలో చోటుచేసుకుంది. -IIలో

గరిష్టం/కనిష్టం
27.9/18.3

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.9 - 18.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

స్పెషల్ డ్రైవ్ కోసం ప్రత్యేక బృందాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రైవేట్ బస్సుల్లో అధిక చార్జీల వసూలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న నేపథ్యంలో తనిఖీల కోసం ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉప రవాణ శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 18 వరకు 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఇందుకోసం రోజువారీగా ఎంవీఐ, ఏఎంవీఐలకు విధులు కేటాయించామని వివరించారు.

సమగ్రశిక్ష ఏపీసీ బాధ్యతల స్వీకరణ


నిత్యానందరాజులు

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా నిత్యనందరాజులు శుక్రవారం కడపలోని సమగ్రశిక్ష కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆయనను సమగ్రశిక్ష ఏపీసీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన సమగ్రశిక్ష కార్యాలయ ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ మురళీకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ చెరకూరు శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సమగ్రశిక్ష కార్యాలయానికి వచ్చి ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా చేపడుతామని తెలిపారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనకు సమగ్రశిక్ష అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు.

జూదాలపై ప్రత్యేక నిఘా


ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జూద క్రీడలు కాకుండా సంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడిపందాలు, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే.. సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని వివరించారు.

13న బండలాగుడు పోటీలు

రాజంపేట టౌన్: రాజంపేట మండలం ఆకేపాటి ఎస్టేట్‌లో ఈనెల 13వ తేదీ ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యూ కేటగిరి విభాగంలో జిల్లాస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాల కోసం 9492532257, 7337515183 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంతర్జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపిక


తల్లిదండ్రులతో అజ్మతుల్లా

కడప స్పోర్ట్స్: కడప నగరం గాంధీనగర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్.అజ్మతుల్లా అంతర్జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబర్ 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అక్కడ చక్కటి ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. త్వరలో మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబానికి చెందిన క్రీడాకారుడికి ఆర్థికసాయం అందించాలని కోరారు. తమ ఆర్థిక స్తోమత సరిగా లేదని, కావున అజ్మతుల్లాకు చేయూత అందించాలని క్రీడాకారుడి తల్లిదండ్రులు ఎస్.ఆరీఫుల్లా, ఎస్.మాబూచాంద్ కోరారు.

ముక్కోటి.. మురిసిన భక్తకోటి


దేవునికడపలో వైకుంఠ ద్వారంలో దర్శనమిస్తున్న కడప రాయుడు


దేవునికడపలో క్యూలో వేచివున్న భక్తులు


బ్రహ్మంగారిమఠంలో ఆదిశేషు వాహనంపై శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి

ముక్కోటి ఏకాదశి వేళ భక్తకోటి మురిసింది. మోక్ష మార్గం ఉత్తర ద్వార దర్శనంతో పరవశం చెందారు. ఆధ్యాత్మిక దివ్యధామం దర్శనంతో పుణ్యప్రదం సిద్ధిస్తుందనే నమ్మకంతో వైష్ణవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కనులారా దర్శించుకుని తరించారు. నమో నారాయణ స్మరణతో దేవాలయాలు మార్మోగాయి. ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. -సాక్షి, నెట్‌వర్క్


పులివెందులలో సతీసమేతంగా శ్రీరంగనాథస్వామి


పుష్పగిరిలో గరుడ వాహనంపై కొలువు దీరిన చెన్నకేశవస్వామి


ఒంటిమిట్ట మాడ వీధులలో జగదభిరాముడి ఊరేగింపు


ఏకశిలానగరిలో అలరించిన మహిళా భక్తుల కోలాటం


నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో బారులు దీరిన భక్తులు

విషాద ఛాయలు

- వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతితో శోక సంద్రంలో పులివెందుల
- ఆయనతో అనుబంధాన్ని మరువలేమంటున్న జనం

పులివెందుల రూరల్: పారిశ్రామిక వేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి మనుమడు, వైఎస్ మధురెడ్డి కుమారుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన 2017లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజల్లో ముద్ర వేసుకున్నారు. 2018లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగపు ప్రధాన కార్యదర్శిగా పదవి రావడంతో.. పార్టీ ఆదేశాల మేరకు బలోపేతం చేసే విధంగా నిరంతరం కృషి చేశారు. చిన్న పిల్లవాడి నుంచి కార్యకర్తలు, నాయకుడి వరకు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే వారు. రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గంలోనే కాక.. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులలో మంచి పేరు సంపాదించారు. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఒకపక్క రాజకీయాలు, మరో పక్క వైద్య వృత్తిలో రాణిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాలలో ఉంటూ తన వద్దకు ఎవరూ వచ్చినా చిన్న, పెద్దా తేడా లేకుండా.. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సమస్యలను తెలుసుకోవడంలో చొరవ తీసుకుంటుండే వారు. అలాగే వైద్య వృత్తిలో కూడా నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో తనదైన శైలిలో పేరు సాధించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. అనతి కాలంలోనే అధిక గుర్తింపు పొందారు. ఒక్కసారిగా తన అభిమాన నాయకుడు, వైద్యుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసుకున్న పులివెందుల నియోజకవర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎవరూ చూసినా, ఎక్కడ చూసినా మంచి మనస్సున్న నాయకుడిని కోల్పోయామని బాధను వెలిబుచ్చుతున్నారు. వైఎస్ అభిషేక్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, చైర్మన్లు, కౌన్సిలర్లతోపాటు మహిళలు చర్చించుకుంటూ ఆయన లేని లోటును మరువలేమన్నారు. శనివారం జరిగే అంత్యక్రియలకు నియోజకవర్గంలోని అన్ని మండలాలతోపాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి రాజకీయ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన పార్థీవ దేహాన్ని చూసేందుకు తరలి రానున్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి (ఫైల్)


పార్టీ కార్యక్రమంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి (ఫైల్)


వైఎస్ అభిషేక్‌రెడ్డి

వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం బాధాకరం

వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం అత్యంత బాధాకరమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడు అకాల మరణం చెందడం విచారకరమన్నారు. ఆయన లేనిలోటు పూడ్చలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆయన మరణానికి సంతాపం ప్రకటించారు.

-కడప కార్పొరేషన్

ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడు

వైఎస్ అభిషేక్‌రెడ్డి ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడని, పిన్న వయసులోనే చనిపోవడం మనసును కలచివేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం ఆయన చాలా కష్టపడ్డారని, ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. అభిషేక్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక

కడప సెవెన్‌రోడ్స్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు యలహంకలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.20 గంటలకు జక్కూరు ఎయిరోడ్రమ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు రానున్నారు. 11.35 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 11.40 గంటలకు పులివెందులలోని తన నివాసానికి వస్తారు. 11.40 నుంచి 3.40 గంటల వరకు రిజర్వు. 3.45 గంటలకు తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.50 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో అక్కడి నుంచి బయలుదేరి 5 గంటలకు బెంగుళూరులోని జక్కూరు ఏరోడ్రమ్‌కు చేరుకుంటారు. 5.10 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 5.30 గంటలకు యలహంకలోని తన నివాసానికి వెళ్తారు.

హామీ డప్పు.. ఎప్పుడో చెప్పు



❒ నాపేరు భార్గవి. ఊరు రాజంపేట మండలం చిన్న ఓరంపాడు. మా అమ్మనాన్నలది వ్యవసాయ కుటుంబం. చాలా రోజుల నుంచి డీఎస్సీ కోసం కడపలో హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాను. ప్రభుత్వమేమో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వాయిదాలు వేసుకుంటూ వస్తోంది. మాకేమో కోచింగ్ ఖర్చు భారీగా అవుతోంది.



❒ నా పేరు సురేఖ. మాది కుమ్మరమిట్ట రాయచోటి. నా భర్త కార్పెంటర్. నేను డీఎస్సీ కోచింగ్ కోసమని కడపకు వచ్చి హాస్టల్లో ఉంటున్నాను. నా భర్త కార్పెంటర్ పని చేసి నాకు డబ్బులు పంపుతున్నాడు. ప్రభుత్వం నిరుద్యోగుల కష్టాలను గుర్తించి త్వరగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసి పరీక్ష నిర్వహిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

☛ ఇదీ వీరిద్దరి సమస్యే కాదు. జిల్లాలో వేలాది మంది డీఎస్సీ అభ్యర్థులు ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

- మెగా డీఎస్సీ అంటూ కూటమి డాంభికాలు
- నిర్వహణపై రోజుకో ప్రకటన
- ఇప్పటికి మూడు సార్లు వాయిదా
- తాజాగా ఎస్సీ వర్గీకరణ పేరుతో అలసత్వం
- ఎదురు చూస్తున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: 'మేము రాగానే మెగా డీఎస్సీ ఫైలు పైనే తొలి సంతకం' అని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఎట్టకేలకు ఆ ఫైలుపై తొలి సంతకం చేశారు. పోస్టులకు సంబంధించిన ఖాళీలను కూడా సిద్ధం చేశారు. కానీ డీఎస్సీని మాత్రం ఇంత వరకు నిర్వహించలేదు. రోజుకో సాకు చూపుతూ వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తోంది. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక రాగానే.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ కొత్త కొర్రీ వేసి వాయిదా వేసింది. దీంతో నెలల తరబడి వాయిదాల పర్వం కొనసాగుతోంది. నిరుద్యోగులు మాత్రం కోచింగ్ సెంటర్లలో పడిగాపులు కాస్తూ డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వమేమో వాయిదాలతో నెట్టుకొస్తోంది. దీంతో నిరుద్యోగుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలోపు డీఎస్సీ నిర్వహించి, పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

సాకులతో..

తొలుతేమో టెట్ మరోసారి నిర్వహించి ఆపై డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పింది. ఆపై గతంలో డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి అడ్డంగులు తొలగించి నోటిఫికేషన్ ఇస్తామని వాయిదా వేశారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక అందాకే అంటూ మెలిక పెట్టింది. ఎస్సీ కమిషన్ నివేదిక వచ్చేదెప్పుడు, డీఎస్సీని నిర్వహించేదెప్పుడని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇందంతా ఇప్పుడిప్పుడే సాధ్యమయ్యేపనేనా అని వారు పెదవి విరుస్తున్నారు.


కోచింగ్ తీసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు


» జిల్లాలో ఖాళీలు

జిల్లా వ్యాప్తంగా 2025 ఏప్రిల్ చివరి నాటికి పలు పాఠశాలల్లో పని చేసే స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీకి సంబంధించి 1195 పోస్టులు ఖాళీ కానున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 84, తెలుగు 67, హిందీ 38, మ్యాథ్స్ 43, ఫిజికల్ సైన్సు 28, బయలాజికల్ సైన్సు 55, సోషియల్ 74, సంస్కృతం 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 78 పోస్టులు ఖాళీ కానున్నాయి. ఉర్దూ విభాగానికి సంబంధించి స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 3, ఫిజికల్ సైన్సు 6, బయలాజికల్ సైన్సు 3, సోషియల్ 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు ఎస్‌జీటీ తెలుగు 612, ఎస్‌జీటీ ఉర్దూ 89 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని పోస్టులకు సంబంధించి 1195 పోస్టులు ఖాళీ కానున్నట్లు తెలిసింది. కాకపోతే డీఎస్సీలో ఎన్ని ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

▸▸ నిరుద్యోగులతో ఆటలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా.. డీఎస్సీని నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో.. చాలా మంది అభ్యర్థులు తాము పని చేస్తున్న ప్రైవేటు కొలువులు సైతం వదులుకుని వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకుని డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉసూరుమంటూ కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

ఎప్పటి నుంచో కోచింగ్ తీసుకుంటున్నాం



ప్రభుత్వం త్వరగా డీఎస్సీ నిర్వహిస్తే నిరుద్యోగుల ఆశలు నెరవేరుతాయి. ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం వేలాది మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రభుత్వమేమో అదిగో ఇదిగో అంటూ వాయిదాలు వేస్తోంది. త్వరగా నోటిఫికేషన్‌ను విడుదల చేసి డీఎస్సీ నిర్వహిస్తే నిరుద్యోగులంతా సంతోషిస్తారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి. – కె.లోకేశ్వరి, నందలూరు

క్లుప్తంగా

మహిళ మెడలో చైన్‌ అపహరణ

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో జొన్నగడ్డల లక్ష్మీదేవి మెడలో బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం లాక్కెళ్లినట్లు ఆమె కుమారుడు నిమ్మకాయల రంగయ్య తెలిపారు. 3.50 తులాల బంగారు గొలుసు ధరించిన తన తల్లి ఉదయం చిత్రావతి నది పక్కన పొలానికి వెళ్లి రోడ్డు వెంబడి ఇంటికి వస్తుండగా అనంతపురం రోడ్డులో ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఆపి.. ఆమె మెడలోని గొలుసును లాక్కొని వెళ్లారని తెలిపారు.

బస్సు ఢీకొని విద్యార్థులకు గాయాలు

కురబలకోట : అంగళ్లులోని ఓ ఇంజినీరింగ్‌ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌ కథనం మేరకు.. మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట దగ్గరున్న కాలనీకి చెందిన మహమ్మద్‌ ఫయాజ్‌(23), అద్నాన్‌ (23) అంగళ్లులోని మిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అంగళ్లు సమీపంలోని మల్లేల గడ్డ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహనానికి సైడ్‌ ఇచ్చే క్రమంలో వీరి వాహనాన్ని ఢీకొంది. ఫయాజ్‌, అద్నాన్‌ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వీరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుక్క అడ్డు రావడంతో...

మదనపల్లె : కుక్క అడ్డు రావడంతో ఒకరు గాయాలపాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మదనపల్లె మండలంలోని గూటంవారిపల్లెకు చెందిన మునిశేఖర్‌(21) ప్రయాణీకులతో ఆటోలో వస్తున్నారు. పుంగనూరు రోడ్డులోని వైజంక్షన్‌ సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మునిశేఖర్‌ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నర్సింగ్‌ విద్యార్థి అదృశ్యం

సంబేపల్లె : మండలంలోని యర్రగంట్లకు చెందిన ఓ మైనర్‌ బాలిక అదృశ్య మైనట్లు సంబేపల్లె పోలీసుల తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన మైనర్‌ బాలిక రాయచోటిలోని ఓ కళాశాలలో నర్సింగ్‌ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి నుంచి కనుపడడంలేదని శుక్రవారం విద్యార్థి తండ్రి పోలీస్‌ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వద్దన్నా.. ఆగని అదానీ

విద్యుత్తు భారంతో ఇప్పటికే సతమతమవుతున్న ఇంటి యజమానులకు మరో షాక్‌ తగులుతోంది. త్వరలో స్మార్టు మీటర్లు బిగించ నున్నారు. చాలా వరకూ కమర్షియల్‌ కనక్షన్‌గా మారిపోనున్నాయి. విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉన్న చోట.. నెలవారీ బిల్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

- ఈ ఏడాది చివరికే స్మార్టు మీటర్లు
- ఇప్పటికే కమర్షియల్‌ మీటర్లు బిగింపు
- త్వరలో ఇంటి మీటర్లకూ మార్పులు

జమ్మలమడుగు : జిల్లాలో ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి కమర్షియల్‌, ఇళ్లకు సంబంధించిన స్మార్టు మీటర్లు బిగించాలంటేప్రభుత్వం విద్యుత్తు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఇప్పటివరకూ ఉన్న మీటర్ల స్థానంలో ఆదాని కంపెనీకి సంబంధించిన స్మార్టు మీటర్లు బిగించడం ప్రారంభించబోతున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో కమర్షియల్‌ కనెక్షన్లయిన దుకాణాలు, వ్యాపార సంస్థలకు స్మార్టు మీటర్లను బిగించేశారు. జిల్లా వ్యాప్తంగా త్వరలో వీటిని అమర్చనున్నారు.

జిల్లాలో 9.42 లక్షల కనెక్షన్లు

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కమర్షియల్‌, నాన్‌ కమర్షియల్‌ కింద 9.42 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ మీటర్లను తొలగించి ఆదానీ కంపెనీకి సంబంధించిన విద్యుత్తు మీటర్లను అమర్చబోతున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌ చివరికి కచ్చితంగా జిల్లా వ్యాప్తంగా పాతవాటిని తొలగించి కొత్త మీటర్లను బిగించేయనున్నారు.

టెక్నాలజీ ఈ మీటర్లు..

ప్రస్తుతం ఉన్న మీటర్లను కొత్త టెక్నాలజీ ఉపయోగించి ఆదాని కంపెనీ తయారుచేస్తోంది. ఈ కంపెనీకి సంబంధించిన స్మార్టు మీటర్లు బిగించి ఎక్కడ విద్యుత్తు వినియోగం ఎక్కడ ఉందో గుర్తించి ప్రస్తుతం ఉన్న కెపాసిటీని పెంచబోతున్నారు. ఏసీ, వాషింగ్‌ మిషన్లు ప్రయోగించే వారికి విద్యుత్‌ బిల్లుల మోత మోగనుంది. కిలో వాట్స్‌ పెంచి వారిపై మరింత భారం వేయనున్నారు. విద్యుత్తు స్మార్టు మీటర్లల్లో స్మార్టు చిప్‌ ఉపయోగించబోతున్నారు. ఈ చిప్‌ వివరాలు తీసుకుని అధికారులు తమ సిస్టం ముందు ఎవరు కాల్చుతున్నారో వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రీపెయిడ్‌ విధానం ఉండదని, రాబోయే రోజుల్లో ఉండవచ్చు అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



కమర్షియల్‌ దుకాణాలలో బిగిస్తున్న స్మార్టు మీటర్లు

ఈ ఏడాది చివరికి అన్ని చోట్ల ఇవే ఉంటాయి...



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జమ్మలమడుగు సబ్‌ డివిజన్‌ పరిధిలో స్మార్టు మీటర్లు బిగించాం. ప్రస్తుతం కమర్షియల్‌కు సంబంధించిన కనెక్షన్లు ఇవ్వడం జరుగుతోం. త్వరలో ఇంటింటా మీటర్లు తొలగించి వాటి స్థానంలో అదానికి సంబంధించిన స్మార్టు మీటర్లు బిగిస్తాం. ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 88 వేల కొత్త మీటర్లు బిగిస్తాం.

– రాజగోపాల్‌, ఏడీ, విద్యుత్తు శాఖ, జమ్మలమడుగు

అధికారం వైపే తహసీల్దారు మొగ్గు

- రేషన్‌ డీలర్ల ఎంపికలో తహసీల్దారు చేతివాటం
- వైఎస్సార్‌సీపీ సానుభూతిదారులంటూ దరఖాస్తుల తిరస్కరణ

కాశినాయన : రేషన్‌ డీలర్ల నియామకాల్లో అధికార పార్టీ నాయకుల హవా కొనసాగుతోంది. పారదర్శకంగా నిర్వహించాల్సిన తహసీల్దారు కూడా అధికారం వైపే మొగ్గు చూపారని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. రెండు నెలల కిందట మండలంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తాళలేక నయానో.. భయానో 14 మంది రేషన్‌ డీలర్లతో అధికారులు రాజీనామా చేయించారు. కొత్త డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్‌ జారీ చేసి.. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. 14 డీలర్‌షిప్‌లకు గానూ 31 దరఖాస్తులు రాగా, తహసీల్దారు తన చేతివాటం ఉపయోగించి 17 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిదారుల దరఖాస్తులను చెల్లవంటూ పరిశీలనలో తిరస్కరించారు. 11న బద్వేలు ఆర్డీఓ కార్యాలయంలో డీలర్‌షిప్‌ దరఖాస్తుదారులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో హాల్‌ టిక్కెట్లు ఇవ్వాలని దరఖాస్తుదారులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లగా, మీ దరఖాస్తుల్లో తప్పులు ఉండడంతో తిరస్కరించామని తహసీల్దారు వెంకటసుబ్బయ్య తెలిపినట్లు దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు వివరణ కోరేందుకు సాక్షి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఆర్డీఓ చంద్రమోహన్‌ వివరణ కోరగా తహసీల్దారుతో మాట్లాడి చెబుతానని, విచారణలో దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆర్డీఓ తెలిపారు.


నరసాపురం తహసీల్దారు కార్యాలయం

డబ్బు ఇవ్వలేదని కొడవలితో దాడి

మదనపల్లె : అడిగిన వెంటనే డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తిపై కొడవలితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. బాధితుడి వివరాల మేరకు... ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కేశవులు కుమారుడు పి.నారాయణ(35) స్థానికంగా ఓ గది అద్దెకు తీసుకుని గోనె సంచులు కుడుతూ జీవిస్తున్నారు. బుగ్గకాలువకు చెందిన జగదీష్‌ తరచూ దుకాణం వద్దకు వచ్చి డబ్బు డిమాండ్‌ చేసేవాడు. రెండు, మూడు సార్లు ఇచ్చినప్పటికీ, శుక్రవారం మరోసారి వచ్చి నారాయణను డబ్బులు అడిగాడు. డబ్బు ఇచ్చేందుకు నారాయణ అంగీకరించకపోవడంతో జగదీష్‌ కొడవలి తీసుకుని దాడికి పాల్పడ్డాడు. అడ్డుకునేందుకు నారాయణ చేయి అడ్డు పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్‌ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి విషమించింది. కురబలకోట మండలం అంగళ్లు పెద్దగేటు ప్రాంతానికి చెందిన గంగాధర్‌ భార్య అమ్ములు(37) కుటుంబ సమస్యలతో సూపర్‌ వాస్మాల్‌ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అదే విధంగా తిరుపతికి చెందిన అన్వర్‌ కుమారుడు అజ్మల్‌(47) భార్యతో గొడవపడి కురబలకోట మండలం సింగన్నగారిపల్లెలో ఉంటున్న తమ్ముడి వద్దకు వచ్చాడు. మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అనంతరం వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్‌ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్‌ ఢీకొని నాలుగు గొర్రెలు మృతి

కమలాపురం : గొర్ల మంద పైకి ట్రాక్టర్‌ దూసుకెళ్లడంతో నాలుగు మృతి చెందాయి. బాధితుల సమాచారం మేరకు.. మండలంలోని కుప్పారువారిపల్లెకు చెందిన మద్దిలేటి, రామయ్య, అయ్యప్పలకు చెందిన గొర్రెలను తీసుకుని శుక్రవారం రాత్రి కుప్పారువారిపల్లెకు వెళ్తున్నారు. జడ్పీ బాయ్స్‌ హైస్కూల్‌ వద్దకు రాగానే కమలాపురం నుంచి కోగటంవైపు వెళ్తున్న ట్రాక్టర్‌ గొర్ల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 4 గొర్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఏడు గొర్లు గాయపడ్డాయి. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. గొర్రెల మందపైకి ఎక్కిన ట్రాక్టర్‌నిలపకుండా వెళ్లిపోయారని బాధితులు తెలిపారు.


ట్రాక్టర్‌ దూసుకెళ్లడంతో మృతి చెందిన గొర్రెలు

సాగు భూమి పంచే వరకూ పోరాటం

ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని తీసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేసే వరకూ పోరాడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. గాలి చంద్ర మాట్లాడుతూ పాలకప్రభుత్వాలు ఎన్నికల ముందు రేషన్‌ కార్డు అందజేయడంతోపాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, 24 గంటలపాటు తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే హామీలకు తిలోదకాలివ్వడం తగదన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి రూ.4 లక్షలతో నిర్మాణం పూర్తి చేయిస్తానని చెప్పిమాట నిలబెట్టుకోవాలన్నారు. భూమిలేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అమ్ముకునే డీకేటి మాఫియాకు కొమ్ము కాయడం మంచిది కాదన్నారు. ఆరు మాసాల పాలనలో మొదటి రెండు చట్టాలను పునరుద్ధరించి పేదల భూములు అడ్డగోలుగా ఆక్రమించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. పేదవాడు జానెడు జాగాలో గుడిసె వేసుకుంటే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోసం కలెక్టర్‌ కార్యాలయాల దిగ్బంధనం తప్పదని వారు హెచ్చరించారు. ఆందోళన అనంతరం తహసీల్దారు నారాయణరెడ్డికి సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్‌.వెంకట్‌ శివ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎన్‌.విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి బాదుల్లా, గంగా సురేష్‌, జి మద్దిలేటి, సావంత్‌ సుధాకర్‌, మునెయ్య, శంకర్‌నాయక్‌, టి మనోహర్‌రెడ్డి, పి.మల్లికార్జున, వి భాగ్యలక్ష్మి, దస్తగిరి, లింగన్న, బ్రహ్మం, నరసింహారావు, నాగరాజు, సుబ్బరాయుడు, శివశంకర్‌ పాల్గొన్నారు.


తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఛైర్మెన్‌, ఈఓలను వెంటనే తప్పించాలి

కడప కార్పొరేషన్‌ : తిరుమలలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెందిన ఘటనపై టీటీడీ పాలకమండలి బాధ్యత వహించాలని.. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, టీటీడీ మాజీ సభ్యులు ఎస్‌.యానాదయ్య డిమాండ్‌ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకమండలి చేతగాని నిర్ణయాలతోనే ఈ ఘోరం జరిగిందని, అన్యాయంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, 30 మందికిపైగా గాయపడ్డారన్నారు. ఐదేళ్లుగా తిరుమలకు రాలేదని అహంకారపూరితంగా మాట్లాడిన బీఆర్‌.నాయుడు వంటి వ్యక్తి ఛైర్మెన్‌గా ఉండటంతోనే ఇలా జరిగిందన్నారు. వెంటనే ఛైర్మెన్‌ బీఆర్‌.నాయుడు, ఈఓ శ్యామలరావు, ఏఈఓ వెంకయ్య చౌదరిలు భక్తులకు క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వం వారిని తొలగించాలని డిమాండ్‌ చేశారు. సర్వ దర్శనానికి వచ్చేవారికి టోకెన్లు ఇవ్వడంతో ఈ తొక్కిసలాట జరిగిందన్నారు. ఎప్పుడూ లేని విధంగా టోకెన్‌ తీసుకుంటేనే పైన దర్శనం అనే దుర్మార్గపు ఆలోచనతోనే ఈ ఘటన జరిగిందన్నారు. డీఎస్పీ, జేఈఓలను సస్పెండ్‌ చేయడం దుర్మార్గమని, చిత్తశుద్ధి ఉంటే అసమర్థుడైన ఛైర్మెన్‌, ఈఓ, ఏఈఓలతో రాజీనామా చేయించాలన్నారు. పవన్‌ కళ్యాణ్‌ తప్పు ఒప్పుకున్నారని, ఆయన మాట్లాడిన మాటకు కట్టుబడి చావులకు కారణమైన ఛైర్మెన్‌, ఈఓ, ఏఈఓలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని అడ్డుకోవడం చేతగానితనమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్‌, జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి, 30వ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎస్‌ఎండీ షఫీ, రామ్మోహన్‌ రెడ్డి, గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్‌. యానాదయ్య

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే భక్తుల మృతి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

ప్రొద్దుటూరు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవుని దర్శనం కోసం టికెట్లు తీసుకునేందుకు వెళ్లిన ఆరుగురు భక్తులు తిరుపతిలో మృతిచెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని దొరసానిపల్లెలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన జరిగి అమాయకులే ప్రాణాలు కోల్పోయారన్నారు. 45 మంది గాయపడడం తనను ఎంతో కలిచి వేసిందని, కూటమి ప్రభుత్వంలో సామాన్య భక్తులకు విలువలేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ సంఘటనకు టీటీడీ పాలకమండలితోపాటు ప్రధాన అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్‌ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. గోదావరి పుష్కరాలు, కందుకూరు సంఘటనలు, ఇపుడు తిరుమల ఘటనల్లోనూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకొన్నారన్నారు. లక్షల మంది టోకెన్ల కోసం గుమికూడితే భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం విఫలమైందని, లైన్‌కు ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీటీడీ ఛైర్మన్‌ బీఆర్‌.నాయుడు జరిగిన సంఘటనలకు చింతించడం తప్ప ఏమి చేస్తామనడం శోచనీయమన్నారు. ఒక్కొక్క మృతుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇచ్చి, వారి కుటుంబీకులకు టీటీడీలో శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సుమోటోగా కేసులు స్వీకరించి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజలంతా విచారం వ్యక్తం చేస్తుంటే హోంమంత్రి మాత్రం ఇది కుట్ర అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ ఛైర్‌పర్సన్‌ జేష్టాది శారద, మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్‌ యాదవ్‌, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గుర్రం లావణ్య, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

కర్నూలు, నెల్లూరు జట్ల విజయం


తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు


లిఖిత్‌, చిత్తూరు (61 పరుగులు)


జాన్సన్‌, నెల్లూరు (55 పరుగులు)


యశ్వంత్‌సూర్యతేజ, కర్నూలు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్‌ అండర్‌–12 అంతర్‌ జిల్లాల క్రికెట్‌ టోర్నమెంట్‌లో శుక్రవారం కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్‌ఆర్‌ఆర్‌–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న చిత్తూరు జట్టు 35 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. జట్టులోని పి. లిఖిత్‌ ఇరగం రెడ్డి 61 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్‌ పార్థివ్‌ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 160 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని జాన్సన్‌ 55 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు జట్టు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుని 33 ఓవర్లలో 107 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని మోక్షజ్ఞ తేజ్‌ 36 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్‌ యశ్వంత్‌ సూర్యతేజ 5 వికెట్లు తీశా డు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 29 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. జ ట్టులోని రేవంత్‌ 27 పరుగులు చేశాడు. దీంతో కర్నూ లు జట్టు 1 వికెట్‌ తేడాతో విజయం సాధించింది.

వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుల నియామకం

వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

– కడప కోటిరెడ్డిసర్కిల్‌

పులివెందుల నియోజకవర్గం

పులివెందుల మండలానికి ఎ.భాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీ క్లస్టర్‌–1కు డి.గంగాధర్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్‌ క్లస్టర్‌–2కు హాఫీజ్‌ఖాన్‌, చక్రాయపేటకు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వేంపల్లెకు కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, వేములకు ఎన్‌.సాంబశివారెడ్డి, తొండూరుకు బి.రవీంద్రారెడ్డి, సింహాద్రిపురానికి ఓ.శ్రీకాంత్‌రెడ్డి, లింగాలకు ఎం.వెంగళరెడ్డి (బాబు)

బద్వేలు నియోజకవర్గం

కాశినాయన మండలానికి జి.హనుమంతరెడ్డి, కలసపాడుకు ఎస్‌.సుదర్శన్‌, పోరుమామిళ్లకు సీఎం.బాషా, బద్వేలుకు మల్లేశ్వర్‌రెడ్డి, బద్వేలు మున్సిపాలిటీకి జి.సుందర్‌రామిరెడ్డి, బి.కోడూరుకు రామకృష్ణారెడ్డి, అట్లూరుకు ఎం.ప్రభాకర్‌రెడ్డి, గోపవరానికి జి.రవిచంద్రారెడ్డి

జమ్మలమడుగు నియోజకవర్గం

జమ్మలమడుగు మండలానికి వి.విజయభాస్కర్‌ రెడ్డి, జమ్మలమడుగు నగర పంచాయతీకి పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, పెద్దముడియంకు ఎం.విష్ణువర్ధన్‌ రెడ్డి, మైలవరానికి దేవిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ముద్దనూరుకు టి.శ్రీధర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌.కొండాపురానికి నవజ్యోతిరెడ్డి, ఎర్రగుంటకు టి.బాలయ్య, ఎర్రగుంట్ల నగర పంచాయతీకి వైజే కృష్ణారెడ్డి

కడప నియోజకవర్గం

కడప నార్త్‌జోన్‌కు బీహెచ్‌.ఇలియాస్‌, కడప సౌత్‌జోన్‌కు పీబీ.రామమోహన్‌రెడ్డి, కడప ఈస్ట్‌ జోన్‌కు కె.రామప్రతాప్‌, కడప వెస్ట్‌జోన్‌కు వి.నాగేంద్రారెడ్డి.

కమలాపురం నియోజకవర్గం

పెండ్లిమర్రి మండలానికి ఎం.రమణారెడ్డి, చెన్నూరు జి.భాస్కర్‌రెడ్డి, వీఎన్‌.పల్లెకు ఎ.రఘునాథరెడ్డి, కమలాపురానికి ఎస్‌.రామకృష్ణారెడ్డి, కమలాపురం క్లస్టర్‌–1కు బి.నిత్యానందరెడ్డి, కమలాపురం నగర పంచాయతీకి సీఎస్‌ గంగాధర్‌రెడ్డి, వల్లూరుకు ఎ.వీరారెడ్డి, సీకే.దిన్నెకు జి.ప్రభాకర్‌రెడ్డి

మైదుకూరు నియోజకవర్గం

మైదుకూరు మండలానికి జి.నరసింహారెడ్డి, మైదుకూరు మున్సిపాలిటీకి. కేసీ.లింగన్న, దువ్వూరుకు ఇ.శంకర్‌రెడ్డి, ఖాజీపేటకు దుగ్గిరెడ్డి మురళీమోహన్‌ రెడ్డి, చాపాడుకు సి.రాజశేఖర్‌రెడ్డి, బి.మఠానికి మేకల రత్నకుమార్‌

ప్రొద్దుటూరు నియోజకవర్గం

ప్రొద్దుటూరు మండలానికి మార్తల ఓబుల్‌రెడ్డి, ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, రాజుపాలేనికి బాన వెంకట కొండారెడ్డి

టీడీపీలో ఇరు వర్గాల ఘర్షణ

ప్రభుత్వ స్థలంలో బంకుల ఏర్పాటుపై వివాదం

గుర్రంకొండ : ప్రభుత్వ స్థలంలో బంకులు, రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొనే విషయమై టీడీపీలోని ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌ ప్రహరీగోడ వద్ద ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన ఓ వర్గీయులు మూడు రోజుల కిందట రెండు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. అదే పార్టీకి చెందిన మరో వర్గం పోటాపోటీగా గత గురువారం రాత్రి అదే జెడ్పీహైస్కూల్‌ ప్రహరీ గోడ వద్ద మరో బంకు ఏర్పాటు చేశారు. దీంతో వివాదం ముదిరి ఘర్షణకు దిగడం, శాంతి భద్రతలకు భంగం కలుగుతుందేమోనని ఎంపీడీవో, పంచాయతీ అధికారులు రంగప్రవేశం చేసి పోలీసుల సాయంతో జేసీబీలతో బంకులు తొలగించడం జరిగినపోయింది. ఇదిలా ఉంటే మధ్యాహ్నం బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్‌(పభుత్వస్థలం) వద్ద ఓ వర్గం రేకుల షెడ్డు ఏర్పాటు చేసే పనులు చేపట్టింది. ఈ ప్రయత్నాలను మరో వర్గం అడ్డుకుంది. జాతీయ రహదారిపై టీడీపీ నేతలు పెద్ద ఎత్తున చేరి బాహాబాహీకి దిగి ఘర్షణ పడ్డారు. ఎస్‌ఐ మధురామచంద్రుడు తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. అయితే పోలీసుల మాటలను లెక్కచేయండా ఓదశలో రెండు వర్గాలు తిరగబడ్డారు. పోలీసులు పెద్ద ఎత్తున చేరుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమనిగింది. రోజంతా టీడీపీలోని వర్గాల నడుమ చెలరేగిన వివాదం పట్టణంలో సంచలనం రేకెత్తించి చర్చనీయాంశంగా మారింది.


జాతీయ రహదారిపై చేరిన టీడీపీ వర్గీయులు